# క్లాస్ మేట్లు

గుండెబోయిన శ్రీనివాస్

(గత సంచిక తరువాయి)

రెచ్చగొడుతున్న మురళిని, పంతానికి పోతున్న నన్ను గమనించిన దినేష్ ఆ రోజు పార్టీని అర్ధాంతరంగా ముగించాడు. ఇంటికి పోబోతుంటే పక్కకు పిలిచి, 'ఈ విషయం మీ ఆవిడకు తెలియదు కదా' అన్నాడు.

నిజమే! అతను అడిగే వరకూ నాకావిషయమే గుర్తు లేదు! ఎందుకైనా మంచిది ఇది నములుతూ వెళ్లు అని ఒక ఖిల్లీ నా చేతికిచ్చాడు. నిజంగా ఖిల్లీ ఆ రాత్రి నా తాగుడును మా ఆవిడ కనిపెట్టకుండా కాపాడిందనే చెప్పాలి. బాబును పక్కలో వేసుకొని భయం భయంగానే నిద్రకు ఉపక్రమించాను. అది మొదట నేను ప్రతివారం సమీక్షాసమావేశాలకు హాజరయ్యేవాడిని. నేను వాళ్లతో కలవడమే ఆనందంగా నన్ను వాళ్ల పార్టీలకు ఆహ్వానించేవాళ్లు. నా భార్య సొంత ఊరు మా ఊరే. ఆమె దాదాపుగా ఆదివారాలు పుట్టింటికి వెళ్లేది. అప్పటి వరకు వారానికొకటి వేసుకొనే ఖిల్లీ రోజూ నమలడం అలవాటయ్యింది. నేను పాన్‌లు తినడం పరిశీలించి, ఒక రోజు పిల్లలు లేని సమయంలో మా ఆవిడ దాని లాభనష్టాలను మర్యాదగానే విసరించింది. యవ్వనంలో చేసే తప్పులైతే ఏదోలే అని సర్దుకోవచ్చు కాని నడివయసులో అలవడే బలహీనతలు కుటుంబనాశనానికి దారి తీస్తాయంది. అక్కడితో ఆగకుండా ఎదుగుతున్న పిల్లలు, పెరుగుతున్న ఖర్చుల గురించి చెప్పింది. కొనసాగుతున్న జీతం కోతను గుర్తు చేసింది. ఇతరత్రా కట్టవలసిన చిల్లరమల్లర అప్పులనూ ఏకరువు పెట్టింది.

ఖిల్లీలకే ఇలా అందంటే మరి తాగుడు చూస్తేనో? ఒక్కసారిగా నాకు ఒళ్లు జలదరించింది. అదీగాక ఆమె చెప్పినదాంట్లో తప్పేమీ కనిపించలేదు. నిజంగా నాకప్పుడు పశ్చాత్తాపమనిపించింది. ఇప్పుడు కూడా హౌజ్ లోను కింద జీతం కట్టవుతూనే వుంది. ఇంకా రెండున్నర యేండ్లయినా అది కొనసాగుతుంది. ఇలాంటి కష్టసమయంలో మనం ఎన్నో కొన్ని త్యాగాలు చేస్తే తప్ప సంసారనావ సక్రమంగా నడవదనిపించింది. ఆమెకు తెలియకుండా అలవడిన ఈ తాగుడు ఆమెకు తెలియకముందే మానేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాను. ఆరు రోజుల వరకు ఆ ఆలోచనే రాలేదు.

అదే రోజు మా ఆవిడ వాళ్ల పుట్టింటికి వెళ్లింది. ఏడో రోజు సాయంత్రం అయిందో లేదో నా కాళ్లు అటే లాగడం మొదలెట్టాయి. మందుకు మనుషులను లొంగదీసుకునే మహత్తరశక్తి యేదో ఉన్నట్లుంది. లేకపోతే కచ్చితమైన సమయానికి మనిషిని కట్టిపడవేసినట్లు సరిగ్గా అక్కడికే తీసుకుపోవడమేమిటి? ఎంత వద్దనుకున్నా మనసు నా మాట వినడంలేదు. ఆ మానేసేదేదో ఈ ఒక్కసారి తాగి మానేస్తే పోలా? అని మెల్లమెల్లగా పాడవసాగింది. మా ఆవిడ ఇంట్లో లేదనే ధీమా దానికి ఊతం ఇచ్చింది. 'మందు' చూపు ఉన్నవాడికి ముందు చూపు మందగిస్తుందనుకుంటా!

ఆ రాత్రి మొగిలి పుట్టిన రోజు సందర్భంగా సమావేశం రసవత్తరంగా జరిగింది. ఆ ఆనందంలో తరువాత వారం బ్రహ్మాండమైన పార్టీ ఇస్తానని వాగ్దానం చేసి, ఇంటికి బయలుదేరాను. ఇంటి దరిదాపులకు వచ్చేసరికి లోపల లైట్లు వెలుగుతూ కనిపించాయి. బహుశా బయటికి వెళ్లేటప్పుడు ఆర్పడం మరచిపోయాననుకొని ఇంకో నాలుగడుగులు వేశాను. తలుపులు తెరిచేవున్నాయి. అనుమానపడుతూనే ఇంట్లోకి అడుగు పెట్టాను.

ఎదురుగా మా ఆవిడ! ఆమెను చూసిన అరక్షణంలోనే నాకు ఎక్కిన మత్తు దిగిపోయింది. తెల్లబోయి నిలబడ్డ నన్ను ఏవిటండీ అలా ఉన్నారు అంటూ పరిశీలనగా చూసింది. ఆమెకు మొదట ఏమీ అర్థం కాలేదు. ఆ తరువాత ఏదో అర్థమైనట్లుంది. అది నిజమేనని నిర్ధారించుకున్న మరుక్షణం, మా ఇద్దరి మధ్య గల్ఫ్ యుద్ధం లాంటి భీకరసంగ్రామం జరిగింది. నేను సరెండర్ కాక తప్పలేదు.

ఫలితంగా మా ఇద్దరి మధ్య షరతులతో కూడిన సంధి కుదిరింది. దాని ప్రకారం ఆఫీసు వదలిన అరగంట లోపే నేను విధిగా ఇల్లు చేరాలి. పని వేళల్లో ఎప్పుడైనా ఆఫీసుకు ఫోన్ చేసి నా గురించి ఎంక్వైరీ చేసే అధికారం ఆమెకు వుంటుంది. ఒక వేళ ఆ సమయంలో నేను అక్కడలేకున్నా, ఆఫీసు పని మీద బయటకు వెళ్లినా, అందుకు సాక్ష్యాలూ, ధ్రువీకరణపత్రాలూ, వెంటతెచ్చుకోవడం తప్పనిసరి.

ఆ రోజు నుండి ఆఫీసేతరసమయాలలో బయట తిరిగే హక్కును నేను ఆటోమాటిక్‌గా కోల్పోతాను. వీటన్నింటినీ మించి ఇంట్లే నిద్రిస్తున్న మా కూతురును మంచం మీది నుండి నా దగ్గరికి లాక్కొచ్చి నా కుడి చేతిని లాగి దాని నెత్తి మీద పెట్టి మళ్లీ మందు ముడితే మా కూతురును నిర్దాక్షిణ్యంగా నేనే హత్య చేసినట్టని నా తరపున ఆమే ఒక భీకరమైన ప్రతిజ్ఞ చేసింది. నేను చేసేది ఏముంది కనుక? ఆవిడ విశ్వరూపాన్ని చూస్తూ నిలుచుండిపోయాను.

అదిగో, అప్పటి నుండి ఆరు వారాలుగా మందు మాటెత్తితే ఒట్టు. నేను తాగవద్దని తప్పించుకు తిరుగుతున్నా, వీళ్లు నన్ను వదిలిపెట్టేటట్లు లేరు.

ఆగిన ఆటో కుదుపుకు మొదట ఆలోచనల నుండి, ఆ తరువాత ఆటో నుండి బయటపడ్డాను. అప్పటికే దిగి నిలబడ్డ మురళి నడుస్తున్న నన్ను నిలబెట్టి, 'చూడు మిస్టర్ ఈశ్వర్ ఫ్రెండ్షిప్పనేది న్యూటన్ మూడో గమన నియమం లాంటిది. పుచ్చుకోవడం జరిగిందంటే ఇవ్వడం జరిగితీరాలి. పార్టీలు మేమిచ్చినంతకాలం వచ్చి తాగి తందనాలాడావ్. ఒక్కసారి పార్టీ ఇమ్మనగానే తప్పించుకు తిరుగుతున్నావ్ ఇదేనా నీ మర్యాద' అన్నాడు.

మురళి మాటలకు నా మనసు చివుక్కుమంది. అది గమనించి దినేష్ నా దగ్గరకు వచ్చి 'టేకిట్ ఈజీ' అని నా చేతిని పిసికేడు. నేను కొంచెం చల్లబడ్డాను.

అదే బార్‌లో, అదే స్థలంలో, మళ్లీ మేమే కూర్చున్నాం. మమ్మల్ని ఎక్కడి నుండి కనిపెట్టారో డేగల్లాగా మా టేబుల్ వద్దకు నలుగురు వ్యక్తులు "హాయ్ హలో" అంటూ వచ్చి పక్కనే ఉన్న కుర్చీలు లాక్కుని కూర్చున్నారు. పొడుగాటి గడ్డం ఉన్న వ్యక్తి దినేష్ సాబ్! ఆదాబర్సే! అన్నాడు.

"పోనే బర్సే" దినేష్ మాటలకు అందరూ పగలబడి నవ్వారు. ఎప్పుడూ సీరియస్‌గా వుంటూ సీరియస్ జోకులు పేల్చడంలో దినేష్ దిట్ట.

నవ్వుతూ నవ్వుతూనే అందులో ఒకడు మొగిలి వద్దకు వెళ్లాడు.వెళ్లి "మొగిలీ...! గిలిగిలీ...! చక్కిలి గిలిగిలీ...!" అంటూ చక్కిలిగిలి చేసేడు. మళ్లీ నవ్వులు.

వీడి సాన్నిహిత్యం పాడుగాను! ఎంత క్లోజునెస్ ఉంటే మాత్రం బారులో సరసాలా! వాడి ప్రవర్తన నాకే మాత్రం నచ్చలేదు. ఒకటి -రెండు నిమిషాల తరువాత ఏదో పైపై పరిచయాలయ్యాయనిపించి, వాళ్లలో వాళ్లే మాట్లాడుకోసాగారు. వచ్చినవాళ్లు పోతారేమోనని పదినిమిషాలసేపు చూశాను కానీ ఒక్కడూ కదలడే! పైగా వాళ్లా విషయమే మరచిపోయినట్లు ప్రవర్తిస్తున్నారు. పరిస్థితి చూడబోతే తడిసి మోపెడయ్యేటట్లుంది.

నా అవస్థను చూసి మురళి లోలోపలే నవ్వుకుంటున్నాడు. ఆ ఆనందాన్ని ఆపుకోలేనట్లు 'ఏమంటావ్ అదే ఏం తెమ్మంటావ్?' అని అన్నాడు, నేనెక్కడ తప్పించుకుంటానోనన్నంత ఆదుర్దాగా.

'తెమ్మనకపోతే తప్పుతుందా ముందు రమ్మను వాడిని' అన్నాను.

'నువ్వు రమ్మంటే 'రమ్మే' నడిచొస్తుంది వాడొకలెక్కా ఏయ్! బేరర్!' కేకేశాడు మురళి.

అప్పటి దాకా ఏదో మాట్లాడుకుంటున్నవాళ్లల్లా, ఆర్డరివ్వడంతోటే అంతా సెట్ రైట్ అయ్యారు. పార్టీ మొదలయ్యింది. వాతావరణం చల్లగా ఉండడం మూలాన ఒక్క పెగ్గు తీసుకోగానే నా ఒళ్లు జలదరించినట్లయ్యింది.

ఎట్లా కనిపెట్టాడో, 'ఏంటోయ్ ఈశ్వర్ అట్లా వణికిపోతున్నావ్! మీ ఆవిడ గానీ జ్ఞాపకం వచ్చిందా?' అన్నాడు దినేష్.

టెలీపతీనో, రేడియోపతీనో అంటారే! అట్లాంటి విద్యలేమైనా ఇతనికి వచ్చేమో అని నా అనుమానం. లేకుంటే మనిషి మనసులోని విషయాన్ని పసిగట్టి దానిపై మాటల ఈటెల్ని విసరడం మామూలు వాడికి సాధ్యం కాదనుకుంటా. మొహమాటాలు మొదటి రౌండుకే పరిమితమయ్యాయి. రెండవ రౌండు పూర్తి కాకముందే పరిస్థితి నా కంట్రోలు దాటిపోయింది. ఓటీలు, యంసీలు చికెన్ సిక్స్‌టీఫైవులూ, సెవెంటీ ఫైవులు, తిండికి తిండి, మందుకు మందు! నా ప్రమేయం లేకుండానే ఆర్డర్లు పోతున్నాయి, సప్లైలు జరిగిపోతునే ఉన్నాయి. ఒకనితో మరొకడు పోటీపడి ఆర్డర్లు జారీ చేస్తున్నారు తప్ప, ఒక్కరూ తృప్తిపడినట్టు కనిపించడంలేదు.



నా బాధ వర్ణనాతీతం. మా ఆవిడ రోజూ పూజ చేసే దేవుళ్లంతా కలిసి ఈ దరిద్రుల దిమ్మ తిరగ్గొట్టి దిమ్మ రిమ్మ తెప్పిస్తే ఎంత బాగుండునని పించింది.

నా పరిస్థితి చూసి, 'డోంట్ వర్రీ ఈశ్వర్ తరువాత చూసుకుందాం' అన్నాడు దినేష్.

ఆ మాటకు నిప్పుల మీద నీళ్లు చల్లినట్లుగా కొంతలో కొంత సర్దుతాడే మోనని, కాస్త ధైర్యం తెచ్చుకొనే ప్రయత్నం చేశాను. బేరర్‌ను గట్టిగా కేక వేసి 'బిల్లు పట్రా!' అన్నాడు దినేష్.

బిల్లు! కస్టమర్ జేబును గురి చూసి కొట్టే బార్‌వాడి విల్లు! అవుతుంది మన పర్సుకు చిల్లు! ఆనందానికి ఇక చెల్లు!! విచిత్రం! బాధలో నాక్కూడా కవిత్వం వస్తోంది. రోట్లో తలపెట్టి రోకటిపోటుకు నిరీక్షించినట్టు బిల్లు కోసం బిక్కుబిక్కుమంటూ చూడసాగాను. ఆ దుర్ముహూర్తం కూడా రానే వచ్చింది.

బేరర్‌గాడు ఎట్లా కనిపెట్టాడో, సరాసరి వచ్చి బిల్లు నా ముందే పెట్టాడు. బిల్లు చూసే సరికి నా కళ్లు బైర్లు కమ్మాయి. నిమిషం వరకూ తేరుకోలేక పోయాను. కళ్లు తెరిచిచూస్తే కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. అంతా కల లోలాగా అనిపించింది. ఇంత తొందరలో ఈ వెధవలు ఇక్కడి నుండి ఎట్లా ఉడాయించారో నాకు అర్థం కాలేదు. బిల్లును పరీక్షగా చూశాను. పదిహేను వందల యాభై రెండు రూపాయలు...! ఏదో మొహమాటానికి పార్టీ ఇస్తానన్నంత మాత్రాన అంతా నా పైకి తోసి అవతల పడతారా! ఇంత దుర్మార్గమా? చేసేదేముంది! జేబులో డబ్బు తీసి బిల్లున్న ప్లేటులో పెట్టాను.

డబ్బు బయటకు తీస్తున్నప్పుడు సన్నగా నా చేతులు వణికాయి. తెల్లవారితే చెల్లించాల్సిన ఇంటి కిరాయి, పాలబిల్లు కళ్ల ముందు కదలాడాయి. పిల్లల స్కూలు ఫీజులు. రిక్షా కిరాయి జ్ఞాపకం వచ్చింది. నెల మధ్యలో రాబోతున్న పండుగ జ్ఞాపకం వచ్చింది. నెలలో ఆ తరువాత గడవాల్సిన మిగతా రోజులు జ్ఞాపకం వచ్చాయి. అది బారే కాకపోతే జోరున ఏడవాలనిపించింది. ముఖాన్ని దిగమింగుకుంటుండగా బిల్లు చెల్లించి బేరర్ చిల్లర తెచ్చిపెట్టాడు. చూస్తే రెండు ఇరవై నోట్లే కనిపిస్తున్నాయ్ నేను ఇచ్చింది పదహారు వందలు.

'అదేమిటి? ఇంకా ఎనిమిది రూపాయలెవ్వి?' నేను గద్దించేసరికి బేరర్ అందులోనే ఉన్నాయంటూ తత్తరపడ్డాడు.

బిల్లు చూడగానే నాకు తాగిన మత్తు ఎప్పుడో దిగిపోయింది. మరి కళ్లకే మైనా చత్వారం వచ్చిందా అనుకుంటూ పరీక్షగా చూశాను. సోంపు తప్ప ఏమీ కనిపించలేదు. ఎందుకైనా మంచిదని అందులో చెయ్యి పెట్టి తడిమితే అప్పుడు తగిలాయి రూపాయి నాణాలు. సోంపు లోపల కుక్కి మరీ తెచ్చాడు బేవార్స్ బేరర్‌గాడు. పైకి కనపడవు కాబట్టి వదిలి వెళ్లుతారు, తరువాత తీసుకోవచ్చు! డబ్బు దొబ్బడానికి ఇదో మార్గమన్నమాట! చూస్తే ఇకిలిస్తున్నాడు. వెధవను గొడ్డును బాదినట్లు బాదాలనిపించింది. నోట్లు, చిల్లర తీసి జేబులో వేసుకొని, సోంపు మొత్తం నోట్లో కుమ్మరించు కొని, కూర్చున్న కుర్చీని కాలితో గట్టిగా తన్నాను.

బార్ బయట అడుగు పెట్టగానే, దాని పక్కనే ఉన్న బజ్జీల బండి దగ్గర అంతా నిలబడి ఉన్నారు. నేను వాళ్ల దగ్గరికి చేరకముందే ఆ గడ్డపోడు 'క్యారే భీమేశ్వర్! బిల్లు కట్టటానికి ఇంత లేటా!?' అన్నాడు.

మర్యాద ముసుగే లేకపోతే వాడిని బండబూతులు తిట్టేవాడిని. కోపాన్ని బలవంతంగా అణచిపెట్టుకున్నాను. నేను మాట్లాడకపోయే సరికి బజ్జీల బండివాడి నుద్దేశించి, 'నీ బిల్లెంతోయ్?' అన్నాడు.

వాడు 'నలభై అయిదు సార్' అన్నాడు.

'ఇంకా బజ్జీలేమన్నా ఉంటే ఆ సార్‌కియ్యి' అని నన్ను ఉద్దేశిస్తూ అన్నాడు.

దానికి వాడు 'అయిపోయినయ్ సార్' అన్నాడు.

దానితో ఆఁ! చూడు మిస్టర్ భీమ్‌సాగర్! ఈ నాటి విజయోత్సవాలు నీకే అంకితం కావాలంటే ఈ బిల్లు కూడా నువ్వే ఇచ్చెయ్' అన్నాడు.

నేను జవాబియ్యక పోవడంతో 'క్యా. సోంచ్‌రయేరే' అంటూ జబర్దస్తీగా నా జేబులో చెయ్యి పెట్టి మొత్తం డబ్బు తీసి, బండివాడి చేతిలో పోసి, 'ఏమన్న ఎక్కువగిన ఉంటే సార్ పేరు చెప్పుకొని చాయ్ తాగు పో!' అన్నాడు.

నిర్ఘాంతపోయాను. నేను ఆ ఆశ్చర్యం నుండి తేరుకోకముందే ఆటో మాట్లాడుకొని వాళ్లంతా అవతల పడ్డారు. చూడబోతే ఇదంతా పథకం ప్రకారమే చేసినట్లనిపించింది. మా వెధవలకు పార్టీ ఇవ్వనందుకు ప్రతీకారంగానే ఈ విధంగా కక్ష తీర్చుకున్నారేమోనని నాకిప్పుడనిపిస్తోంది. బుద్ధి గడ్డి తిని వీళ్ల సహవాసం చేశాననిపించింది.

రిక్షాలోనన్నా ఇంటికి పోదామనుకొని మెల్లగా జేబులోకి చెయ్యిపోనిచ్చాను. అప్పుడు గాని స్ఫురించలేదు నాకు, జేబులో అయిదు పైసలు కూడా లేవని. ఆ క్షణంలో ఆ చుట్టుపక్కల ఎక్కడైనా ఒక కత్తి దొరికితే నాకు నేనే పొడుచుకొని చావాలనిపించింది. బాధ దుఃఖంతో కలగలిసి పోగా నాలుడుగులు ముందుకు వేశాను.

రాత్రి పదకొండు గంటలు దాటినట్టుంది. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. జేబులు ఖాళీగా ఉన్నాయి. ఎదురుగా నేను ఇంటి దాకా నడవాల్సిన అయిదు కిలో మీటర్ల రోడ్డు కనిపిస్తోంది.

ఆకాశంలో చుక్కలు కనిపిస్తున్నాయి. ఉన్నట్టుండి ఆకాశంలో ఉరుములు మెరపులు... ఉరుములు, మెరపుల మధ్య మహంకాళిలా విరుచుకుపడబోతున్న మా ఆవిడ ఉగ్రరూపం కనిపిస్తోంది.

(అయిపోయింది)

## జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ 4వ రాష్ట్రస్థాయి కథలు, కవితల పోటీలు

**జి.**వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ నాల్గవ రాష్ట్రస్థాయి కథలు, కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ గుడిబండి వెంకటరెడ్డి తెలియజేస్తున్నారు. రచయిత తనకు ఇష్టమైన ఏదైనా అంశాన్ని ఎన్నుకుని కథ 8 పేజీలకు మించకుండా, కవిత ఒక పేజీకి మించకుండా వ్రాసి మార్చి 5 లోపు జి.వెంకటరెడ్డి, ఛైర్మన్, జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్, బి70/ఎఫ్1, పి.ఎస్.నగర్, విజయనగర్ కాలనీ, హైదరాబాద్–57 అనే చిరునామాకు పంపాలని తెలిపారు. తమ రచన ఇంతకుముందు ఏ పత్రికలోనూ ప్రచురితం కాలేదన్న హామీ పత్రాన్ని జతచేయాల్సి ఉంటుంది. ఈ పోటీలకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదు. మొదటి నాలుగు ఉత్తమ కథలకు రూ.500/–, 300/–, 200/–, 100/– రూపాయలు, మొదటి నాలుగు ఉత్తమ కవితలకు రూ.350/–, 250/–, 150/–, 100/– రూపాయల చొప్పున నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తాము. విజేతలకు పొండేషన్ 4వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా 3–4–2006 న సాయంత్రం హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గానసభలో బహుమతులు అందజేస్తామని ఆ సంస్థ ఛైర్మన్: గుడిబండి వెంకటరెడ్డి తెలియజేస్తున్నారు. ఇతర వివరాలకు 9849882783 నంబరుకు సంప్రదించగలరు.